# హామీ

**ఒ**క ప్రజాస్వామ్య దేశంలో ఏలిన వారికి హఠాత్తుగా ఒక నేరస్థుడు కావలసి వచ్చాడు. రాజుగారు తలచుకుంటే దెబ్బలకు కొదవా?

ప్రజా సంరక్షకులు వెంటనే బయలుదేరారు. ఒక మారుమూల గ్రామంలో ఒక బక్కచిక్కిన మనిషి మీదపడింది వారి కృపాకటాక్షం. వెంటనే అరదండాలు వేశారు.

తెల్లబోయాడు ఆ బడుగు రైతు. “ఎందుకు బాబూ? నేనేం చేశాను?” అనడిగాడు దీనంగా. ‘ఏం మాట్లాడాలన్నా ఏలినవారి సమక్షంలో స్టేషన్‌లో మాట్లాడు. ఏం చెప్పుకోవాలన్న వారితోనే చెప్పుకో” అన్నారు అరదండాలు వేసిన వారు.

తన భర్తను బంధించారని తెలిసిన వెంటనే గుండెలు బాదుకుని ఏడుస్తూ పరుగు పరుగున వచ్చింది అతని భార్య. బంధించిన వాళ్ళ కాళ్ళ మీద పడిపోయిది. వదిలిపెట్టమని గోడుగోడున ఏడ్చింది.

“నువ్వేం చెప్పుకోవాలన్నా అక్కడికి వచ్చి ఏలినవారికి చెప్పుకో” అరిగిపోయిన రికార్డులా సమాధానం చెప్పారు వాళ్లు.

అభం శుభం ఎరుగని ఆ అమాయకుడు కటకటాల వెనక బందీ అయ్యాడు. “నా నేరం ఏమిటి మొర్రో” అని మొత్తుకున్నాడు.

“ఏం చెప్పాలన్నా కోర్టులో చెప్పుకో” అన్నారు స్టేషన్‌వాళ్ళు.

అతని ఇల్లాలు ఏడ్చి రాగాలు పెట్టి ఊరూ వాడా ఏకం చేసేసింది. ఆవిడ గోడు విని కరిగిపోయిన ఒక పెద్దమనిషి బంధువు కాస్త పలుకుబడి వున్నవాడు. ఆ దూరపు బంధువుకి ఒక నాయకుడు అస్మదీయుడు.

ఏడ్చి మొత్తుకుంటున్న ఆ ఇల్లాల్ని ఆ నాయకుడి దగ్గరికి తీసుకు వెళ్ళారు, ఎలాగైతేనేం.

ఆయన కాళ్ళమీద పడిపోయింది ఈ ఇల్లాలు. కాళ్ళు వెనక్కి లాక్కున్నారు నాయకుడు. "నేను మీ సేవకుడిని. మీరు వేసిన ఓట్లతో ఈ పదవికి చేరుకున్న వాడిని. మీ సేవ నా కర్తవ్యం. కాబట్టి నా కాళ్ళు పట్టుకోవద్దు" అన్నారు.

మరోసారి ఆయన కాళ్ళు పట్టుకుంది ఆ ఇల్లాలు. ఈ సారి ఆయన ఊరుకున్నారు. తన పతికి జరిగిన అన్యాయం చెప్పుకుని ఏడ్చింది ఆవిడ.

చెప్పద్దూ ఆయనకీ దుఃఖం వచ్చింది. కంటతడి రుమాలుతో తుడుచుకున్నారు. ఆ వెంటనే తన పాలనతో అంత అన్యాయం జరిగినందుకు కోపం వచ్చింది వారికి.

అసలు నిజం చెప్పాలంటే దేశంలో అన్యాయం జరగటంలేదు. ధర్మదేవత నాలుగు పాదాలా నడుస్తోంది.

కూతురు హాస్పిటల్లో వుంటే వైద్యంకోసం కక్కుర్తిపడి వంద రూపాయలు లంచం తీసుకున్న చిరుద్యోగిని లాఘవంతో పట్టుకుని జైలు శిక్ష విధించి లంచగొండి తనాన్ని నిర్మూలించే దేశంలో,

ప్రేమించానని, మోసం చేసినవాడు పారిపోతే మరే దారీ లేక రూపాయికీ, రెండ్రూపాయలకీ ఒళ్ళమ్ముకునే ఆడవాళ్ళను లాఠీలతో బెదిరించి అరెస్ట్‌చేసి కోర్టువారి ముందుంచి వ్యభిచారాన్ని రూపుమాపే దేశంలో ఇలాంటి ఘోరం జరగడమా? హరీ హరీ!

"నీకేం భయం లేదమ్మా. నేనున్నాగా! నీ భర్తని జైల్లో పెట్టారు అంతే కదా! ఈ మాత్రం దానికి కొంపేం మునిగిపోలేదు. నేను వెంటనే కనుక్కుంటాను" అన్నారు.

మరోసారి ఆయన కాళ్లకి దణ్ణం పెట్టింది ఆ ఇల్లాలు. "నా ఇంట్లో దీపం పెట్టుకుని నీ పేరే తల్చుకుంటాం మా రాజా!" అంటూ ఆనంద భాష్పాలు రాల్చింది. వంగి వంగి నమస్కారాలు చేస్తూ వెళ్ళిపోయింది.

ఆవిడతో వెంటనే కనుక్కుంటానన్నారు నాయకులు. నిజమే కానీ ఆయనేం గోళ్ళుగిల్లుకుంటూ కూర్చున్నారా?

అలా కూర్చుండానికి ఆయనేం సామాన్యుడా? ఎంతోమంది ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారి కష్టసుఖాలు కనిపెట్టి ఉండాల్సిన బాధ్యత ఆయనమీద ఉంది.

తెల్లవారి లేస్తే లక్షా తొంభై పనులు. ఎంతో మంది సమస్యలను పరిష్కరించాలి.

ప్రారంభోత్సవం చేసిన ఆర్నెల్లలోనే కూలిపోయిన వంతెన విషయంలో అదలా కూలిపోవడానికి కారణం సిమెంటులో కలిపిన బూడిద కాదు, కాలం ఖర్మం కలిసి రాక అలా అనర్థం జరిగిపోయిందని వాదించే కంట్రాక్టరు విషయం చూసుకోవాలా? నాలుగు రోడ్లకూడలిలో సినిమా హాళ్ళు కడితే ట్రాఫిక్ నానా ఖంగాళీగా తయారౌతుంది మొర్రోయనీ మొత్తుకునే వాళ్ళ నోళ్ళు మూయించి పాపం ఆ హాలు కట్టుకునే వాళ్ళకి లైసెన్సు ఇప్పించాలా?

అయినవాళ్లకు ఉద్యోగాలిప్పించడం, కాని వాళ్ళ ఉద్యోగాలు పీకించడం, సీట్లు ఇప్పించటం, ట్రాన్స్‌ఫర్లు రప్పించటం, పర్మిట్లు ఇప్పించటం చెప్పుకుంటూ పోతే చేంతాడంత లిస్ట్ తయారవుతుంది.

ఈ హడావిడిలో పడి ఆయన ఆ ఇల్లాలి విషయం మర్చిపోయారు. అరెస్ట్ చేసిన ఆ అర్భకుడిని కోర్టులో నిలబెట్టారు.

న్యాయం అనేది భలే తమాషాగా వుంటుంది. మనకు జరిగేది న్యాయమా అన్యాయమా? అనే విషయం వాదించే ప్లీడరుమీద ఆధారపడి ఉంటుంది.

బోనులో నిలబెట్టిన అర్భకుడి మీద నేరం మోపారు. అసలా కోర్టు భాష ఏమిటో వాళ్ళు చెప్పేది ఏమిటో అతనికోపట్టాన అంతుబట్టలేదు.

భర్తను కోర్టుకి తీసికెళ్తున్నారని తెలియగానే ఏడుస్తూ మళ్ళీ నాయకుడి దగ్గరకు వెళ్ళింది ఆ ఇల్లాలు. నాలుగురోజులు తిరగ్గా తిరగ్గా వారి దర్శనం దొరికింది.

నెత్తిబాదుకుని ఏడ్చింది. "నా మొగుడిని విడిపించండి బాబూ! వాడేం పాపం ఎరగడు" అంది దీనంగా.

అంతా విని ఆయన గుండె చెరువైపోయింది. "ఏమీ ఫర్వాలేదమ్మా... నీ మొగుడు ఏం చెయ్యలేదంటున్నావుగా. కోర్టులో కేసుకొట్టేస్తార్లే. కేసు జరగనీ. ఆపైన అవసరం అయితే నేను చూసుకుంటాగా!" అన్నారు ధైర్యం చెప్తూ.

ఏడుస్తూనే వెళ్ళిపోయింది ఆ ఇల్లాలు.

కోర్టులో కేసు నడిచింది. మంచి బలంగా ప్లానువేసుకుని పటిష్ఠంగా కేసు తయారు చేసి దిగారు అవతలివాళ్ళు. ఆ ప్లీడరు ముందు ఈ ప్లీడరు ఏనుగు ముందు ఎలకలా వున్నాడు.

ఎక్కువ శ్రమపడకుండా కేసు తేలిపోయింది. అపరాధిగా ఆరోపించబడిన ఆ అభాగ్యుడికి ఉరిశిక్ష వేశారు.

ఆ వార్త వినగానే పొర్లి పొర్లి ఏడ్చింది. ఆ అభాగ్యుడి భార్య వెంటనే పరుగున ఆ నాయకుడి దగ్గరికి వెళ్ళింది. వారు ఊళ్ళోలేరు.

వారం రోజులాగి వస్తారని చెప్పారు.

ఆ వారం రోజులూ అక్కడే పడిగాపులు పడింది ఆ ఇల్లాలు. చివరికెలాగైతేనేం వారి దర్శనం లభించింది.

జరిగిందంతా చెప్పి భోరున ఏడ్చింది ఆవిడ.

కించిత్ చిరాకేసినా ప్రజాసేవకులు కాబట్టి అణుచుకున్నారు.

"ఏమీ కంగారుపడకమ్మా నేనున్నాగా. మీ సేవే నా కర్తవ్యం. ఉరిశిక్ష వేశారన్నవు కదా! ఉరితియ్యనీ. ఆపై విషయం నేను చూసుకుంటాను" అని హామీ ఇచ్చి వెళ్ళిపోయారు.

*జ్యోతి మాసపత్రిక – అక్టోబర్, నవంబర్ 1989*